

# ప్రేమ విజయం

కాశీభట్ల భానుమూర్తి

"రాణీరుద్రమ దేవి తన చేతిలోని కత్తిని చక చకా తిప్పుతూ శత్రుసైన్యం మీదకి ఉరికినప్పుడు శత్రు సైన్యం యుద్ధం చేయటం మానేసి ఎత్తిన ఆమె చేతిలో కత్తిని చూసి" అని ఠక్కున పాఠం చెప్పటం ఆపేసాడు పతంజలి. విద్యార్థులకు పాఠం చెబుతూ యథాలాపంగా పక్క క్లాసువైపు చూసాడు పతంజలి. పక్కన క్లాసులో విమల పిల్లలకి పాఠం చెబుతూ వాళ్ళకివి వర్ణించటానికి బోర్డుమీద చాక్‌పీసుతో బొమ్మలు గీయసాగింది. రుద్రమదేవి కత్తిపట్టుకొని చేతిని ఎత్తింది" అని పతంజలి చెప్పినప్పుడు సరిగ్గా అదే సమయంలో విమల చాక్‌పీసు పట్టుకొని చేతిని ఎత్తింది. ఆమె పెట్టిన భంగిమకి మురిసిపోయి పాఠం చెప్పటం ఆపేసాడు పతంజలి.

చెబుతున్న పాఠం మాష్టారు ఠక్కున ఆపేసి స్టన్‌అయిపోయి స్టోన్‌లా నిలబడటంచూసి హెడ్‌మాస్టారు వస్తున్నారనుకుని పిల్లలందరూ లేచి నిలబడ్డారు పతంజలి క్లాసులోని పిల్లలు లేచి నిలబడటం చూసి విమల క్లాసులోని పిల్లలు హెడ్‌మాష్టారు వస్తున్నారనుకొని లేచి నిలబడ్డారు. దాంతో ఆ వెనకాల క్లాసులోని పిల్లలులేచి నిలబడ్డారు. తాము లేచి నిల బడకపోతే బాగోదని ముందుక్లాసు పిల్లలు లేచి నిలబడ్డారు. ఆఖరికి మొత్తం స్కూలుపిల్లలందరూ లేచి నిలబడ్డారు. దాంతో ఇక తప్పదని టీచర్లుకూడా నిలబడ్డారు భయం భయంగా.

ఆఫీసురూంలో కూర్చుని పేపర్ చదువుకొంటున్న చలపతికి అనుమానం వేసి పేపర్ పక్కన పడేసి లేచి కిటికీలోనుంచి చూసాడు. పిల్లలందరూ లేచి నిలబడ్డారు అని తేలింది.

ఈ స్కూలు హెడ్‌మాష్టార్‌నయిన నేను రాకుండా పిల్లలు ఎలా లేచినిలబడ్డారు అని మనసులో గొణుక్కుని లేచి రౌండ్స్‌కి బయలుదేరాడు నీరసంగా.

ఒక్కొక్క క్లాసుదగ్గరకి వస్తుంటే పిల్లలు నమస్కరించి కూర్చోసాగారు. అలా మొత్తం స్కూల్ అంతా తిరిగి ఆఖరికి పతంజలి క్లాసుదగ్గరకి వచ్చాడు చలపతి.

పతంజలి క్లాసులోని పిల్లలు చలపతికి వినయంగా నమస్కరించి కూర్చున్నారు. కాని పతంజలిమాత్రం ఇంకా అలా రాయిలా నిలబడే ఉన్నాడు.

"మిష్టర్ పతంజలి." కటువుగా పిలిచాడు చలపతి.

అయితే పతంజలి ఈలోకంలో లేడు. ఊహాలోకంలో విమలతో కలసి డ్యూయెట్ పాడసాగాడు. అందుకని చలపతి పిలుపుకి, అరుపుకి రిప్లయి ఇవ్వలేదు.

"పతంజలి నిన్నే." అని మళ్ళీ అసహనంగా పిలిచాడు చలపతి.

సాధారణంగా తెలివైన మాష్టార్లు చురుకైన లీడర్లని పెట్టుకుంటారు. ఆ లీడర్ చదువు వచ్చినా రాకపోయినా, ఆపద సమయాలలో మాష్టార్లని కాపాడటానికి పనికివస్తారు.

పతంజలికూడా తెలివైన మాష్టారే అని నిరూపించటానికి, ఆ క్లాసుకి చురుకైన లీడర్ రాజారావు చటుక్కున పతంజలి కాలుని గట్టిగా తొక్కాడు.

దాంతో విమలతో పాడేపాటని సగంలో

ఆపేసి ఊహాలోకంలోంచి అర్జంటుగావచ్చి కాలుతొక్కిన దాశారావుని తిట్టబోయి, ఆ పక్కనేఉన్న చలపతినిచూసి ఖంగుతిని, కాలర్‌సర్దుకుని ఒకవెర్రినవ్వు నవ్వాడు పతంజలి. కాని చలపతి బదులుగా నవ్వలేదు.

"మిస్టర్ పతంజలి. నీ ప్రవర్తన నాకేం నచ్చలేదు. మనసుని ఎక్కడో పెట్టుకుని పాఠం చెబుతున్నట్టున్నావు. పాఠం చెబుతూ ఆలోచనలు ఏమిటి?" కసిరాడు చలపతి.

"అదికాదు సార్. రాణిరుద్రమదేవి పాఠం చెబుతున్నానండి. యుద్ధం జరిగే సీన్ వర్ణించాలంటే కొద్దిగా ఆలోచించాలికదండి." నసిగాడు పతంజలి.

"వాక్యం వాక్యానికి మధ్య ఇలాఆలోచిస్తూ కూర్చుంటే ఈ సంవత్సరంకోర్సు పూర్తి అవ్వటానికి పాతిక సంవత్సరాలు పడుతుంది." అన్నాడుచలపతి తీవ్రంగా.

అంతెందుకు అవుతుంది సార్. ఏదో యుద్ధంసీన్ కనుక కాస్త ఆలస్యం అయింది. ఈ సీన్ ఆయిపోయిన తరువాత బండి ముందుకి లాగించేయనూ. అన్నాడు పతంజలి ధీమాగా.

సరే. సరే. ఈ సంజాయిషీలతో ఒక సంవత్సరం గడిపే సేటట్టున్నావు. పాఠం మొదలుపెట్టు ముందు. అని పతంజలిని దీవించి ఆఫీసు రూమ్‌కి బయలుదేరాడు చలపతి.

పక్కకి చూసాడు పతంజలి. విమల తనలో తానే నవ్వుకుంటోంది. ఆ నవ్వు తననిగురించే అని పతంజలికి అనుమానం వేసింది. ఆ తరువాత చలపతిమీద కోపం వచ్చింది.

అందమైన ఆడపిల్లముందు తననితిట్టినందుకు చలపతిమీద మహాకోపంవచ్చింది చలపతి పీక నులిమేస్తే ఎలా ఉంటుంది. అని ఆలోచించాడు పతంజలి. అయితే జైలులో ఖైదీలకి పాఠాలు చెప్పుకోవలసి వస్తుందని భయపడి ఆగాడు పతంజలి.

ఇంతలో గంట గణగణలాడింది. పాఠం చెబుదామని మొదలు పెట్టబోయిన పతంజలి గంట మ్రోగడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకొనిపుస్తకాన్ని లీడర్‌కి ఇచ్చేడు.

పతంజలి పాఠం చెప్పటం మానేసినప్పటినుండి చుక్కాట ఆడుకొంటున్న పిల్లలు లేచి నిలబడ్డారు ఆనందంగా. ఇంతలో చలపతి వచ్చి పిల్లలచేత జనగణమన గీతాన్ని పాడించాడు. పిల్లలందరూ భక్తిగా ఆ గీతాన్ని పాడారు. ఆ తరువాత మళ్ళీ గంట గణగణలాడింది. పిల్లలు బిలబిలమంటూ ఇళ్ళకు బయలుదేరారు. చలపతి రూమ్‌కి వెళ్ళిపోయాడు.

పతంజలి నీరసంగా స్టాఫ్‌రూమ్‌కి బయలుదేరాడు. అప్పటికే అక్కడికి శశికాంత్, ఎడ్విన్‌రాజు, సుబ్రమణ్యం, ప్రసాదరావు వచ్చి చేరారు. అందరూ కలసి టీచింగ్‌నోట్సు వ్రాయసాగారు. ఆడవాళ్ళకి వేరే రూమ్ ఉండటం వలన వాళ్ళు వీళ్ళతో కలవరు.

ఆదేమిటి పతంజలి అలా ఉన్నావు? అని ప్రశ్నించాడు ఎడ్విన్‌రాజు.

ఏముంది ఇందాక గురుడు తిట్టాడు. దాంతో మన పతంజలి గాలితీసిన బెలూన్‌లా అయిపోయాడు. అయినా పాఠం మధ్యలో ఆలోచన ఏంట్రా పతంజలీ. అన్నాడు శశికాంత్.

ఆ ఆలోచన పాఠంగురించి కాదురా. విమల గురించి. ఆ అమ్మాయి గురించి వీడు తిట్లు తినని రోజు లేదు. కాని ఆ అమ్మాయిని ప్రేమించక మానడు. అన్నాడు సుబ్రమహ్మణ్యం.

ఒరే ప్రేమగురించి మీకేం తెలుసురా. అది అనుభవించిన వాళ్ళకే తెలుస్తుంది దానివిలువ. విమలని మొదటిచూపులోనే ప్రేమించాను. నా హృదయాన్ని ఆమెకే అర్పించాను. ఆమె "నో" అంటే నా తనువు చాలిస్తాను. అన్నాడు పతంజలి బాధగా మొహంపెట్టి.

ఇంతకీ ఆమె నో అందా? ఆతృతగా అడిగాడు ప్రసాదరావు.

నేను తనువు చాలించలేదుగా. గంభీరంగా అన్నాడు పతంజలి.

అయితే ఆమె ఒప్పుకుందా? ఆనందంగా అడిగాడు ఎడ్విన్‌రాజు.

ఇంకా నేను అడగలేదుగా. నీరసంగా బదులిచ్చాడు పతంజలి.

ఛీ.ఛీ.ఈ పతంజలిగాడు ఒక వేస్టుగాడురా. విమలని అడిగేసి ఏదో ఒకటి తేల్చుకోవాలిగాని ఇలా నీళ్ళు కారిపోతాడేమిటిరా అసహ్యంగా అన్నాడు సుబ్రహ్మణ్యం.

ఒరే నా పరిస్థితి మీకు అర్థంకాదు. ఆ అమ్మాయిని అడుగుదామని ఇంటిదగ్గర అనుకుంటాను. క్లాసుకి వచ్చేదాకా ఆ ధైర్యం ఉంటుంది. తీరా ఆ అమ్మాయి పలకరించాక ఏ చాక్‌పీసో, డస్టరో అడిగి తీసుకుని వచ్చేస్తాను. అన్నాడు పతంజలి.

మరి ఆ చాక్‌పీస్‌నో, డస్టర్‌నో. ప్రేమించక పోయావా? పీడాపోను, అయినా అంత ధైర్యం లేనివాడివి నీకు ప్రేమ ఎందుకురా అన్నాడు సుబ్రహ్మణ్యం నవ్వుతూ.

పతంజలి ఏమీ సమాధానం చెప్పలేక తలదించుకున్నాడు బాధగా.

ఒరే మనం ఒకపనిచేస్తే మంచిదని నా అభిప్రాయం. మనఅందరికీలేనిధైర్యం పతంజలికి ఉంది. చక్కగా, నీట్‌గా, మన స్కూల్‌లోనే పనిచేసే ఒకటీచర్‌ని ప్రేమించాడు. అది మనమందరం గర్వించదగ్గ విషయం. దానికి మనమందరం సపోర్టు ఇద్దాం? వాడి ప్రేమవిజయానికి మనందరం తోడ్పడదాం. అన్నాడు ఎడ్విన్ రాజు.

ఎడ్విన్‌రాజువైపు ఆనందంగా చూసాడు పతంజలి.

అయితే ఏం చేద్దామనీ నీ ఉద్దేశం. అన్నాడు శశికాంత్ అనుమానంగా.

ఏముంది, ముందుగా విమలారాణితో మాట్లాడుదాం. అన్నాడు ఎడ్విన్‌రాజు నవ్వుతూ.

నాయనా బతకలేక బడి పంతులు అన్నారు. దొరక్క దొరక్క ఈ ఉద్యోగం దొరికింది. ఇప్పుడు ఆ చండశాసనుకితో మాట్లాడి ఆ ఉద్యోగం ఊడగొట్టుకోమంటావా? అన్నాడు శశికాంత్ భయంగా. పతంజలి, శశికాంత్‌వైపు చూసి నిర్లిప్తంగా నవ్వాడు.

డియర్ ఫ్రెండ్స్ పతంజలి మన ఫ్రెండు, ఇదివరకు బలిసిన దున్నలా ఉండే మన పతంజలి నేడు బక్కచిక్కిన బల్లిలా తయారయ్యాడు. దీనికి కారణం ఆ విమల. ఆమెను మన పతంజలి అతిగాఢంగా ప్రేమించటమే. ఇలాగే మరికొద్దిరోజులు పతంజలి బాధని మన

పట్టించుకోకపోతే నలకంత నల్లిలా తయారయి ఆ తరువాత "ఇల"లో మిగలకుండా పోతాడు. మన ఫ్రెండ్ మంచి చెడ్డలు చూడటం మన కర్తవ్యం. మన మందరమూ కలిస్తే హెడ్‌గాడిని ఒక ఊపు ఊపవచ్చు. కనుక దీనికి సమ్మతించేవాళ్ళు చేతులెత్తండి. అన్నాడు ఎడ్విన్‌రాజు.

ఎడ్విన్‌రాజు ఉపన్యాస ప్రవాహం హోరులో కొట్టుకునిపోతున్న అక్కడున్న అందరూ ఆఖరికి పతంజలితో సహా ఎడ్విన్‌రాజు ఉపన్యాసం అవగానే తమకున్న రెండేసి చేతులనీ ఎత్తారు సంతోషంగా పతంజలి మొహం ఆనందంతో ఆసియా మ్యాప్ అంత అయింది.

అయితే ఫ్రెండ్స్! విమల ఈపాటికి టీచింగ్‌నోట్సు వ్రాసి ఇంటికి బయలుదేరి ఉంటుంది. మనం ఇప్పుడు ఆమెను ఫాలో అయి ఆమె అభిప్రాయం తెలుసుకొందాం. "ఆలస్యం అమృతం విషం" అని మా తాత సదాశివమూర్తి చెప్పాడు. కనుక ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా విమలని అడిగి, ఆమె అభిప్రాయం తెలుసుకోవాలి. అన్నారు శశికాంత్ లేచి.

టీచింగ్ నోట్సులు అక్కడ పెట్టి అందరూ బయలుదేరారు సంతోషంగా.

ఆ! ఏమిటి వెళ్ళిపోతున్నారా? అని అడిగాడు చలపతి ప్రేమగా.

అయిపోయిందికదండి. వెళ్ళిపోతున్నాం. అని బదులిచ్చాడు ప్రసాదరావు.

ఆ హెడ్‌గాడికి నమస్కారాలివ్వచ్చు. వెళ్లేటప్పుడు మనం విష్ చేయలేదని అది జ్ఞాపకం చేయటానికి పలకరించాడు ప్రేమగా అయితే మనం ఆ ప్రేమ మాటలని పట్టించుకోనంత కుర్రలో ఉన్నామని వాడికేం తెలుసు. అన్నాడు ప్రసాదరావు నవ్వుతూ.

ఐదుగురూ చకచక నడిచి, విమలారాణిని చేరుకున్నారు. ఐదుగురు తనని చుట్టుముట్టేసరికి విమలారాణి ఆగిపోయింది అయోమయంగా.

ఏమిటి కట్టకట్టుకుని అందరూ అడ్డు తగిలారు. అంది విమలారాణి.

చూడండి విమలగారూ. మీకు పతంజలి తెలుసుకదా. అనిఅడిగాడు శశికాంత్

ఆ, తెలియక పోవటమేమిటండి. పది రోజులబట్టీ హెడ్మాస్టర్‌గారి చేతితో, నోటితో తిట్లు తింటున్నారుకదా. అంది విమలారాణి వస్తున్న నవ్వుని ఆపుకుంటూ

అఫ్‌కోర్స్. ఆయనకి తిట్టేటప్పుడు చేయి కదిలించటం అలవాటు అనుకోండి ఆ సంగతి వదిలేయండి. ఈ పతంజలి, మన పతంజలి పవిత్రమైన భారతదేశంలో పుట్టాడు. అందునా చల్లని ఆంధ్రప్రదేశ్ నీడలో చక్కగా అందంగా పెరిగాడు తల్లితండ్రులకి ఒక్కడే కొడుకు. ఆస్తికి లోటులేదు. ఉద్యోగం ఉంది. అని చెప్పటం ఆపాడు ప్రసాదరావు.

ఇవన్నీ నాకు ఎందుకు చెబుతున్నారు అని అడిగింది విమలారాణి.

ఎందుకంటే పతంజలి మిమ్మల్ని గాఢంగా ప్రేమిస్తున్నాడు. అని పాఠం అప్పచెప్పినట్టు చెప్పి పతంజలి వెనక నక్కాడు సుబ్రహ్మణ్యం.

విమలారాణి ఆ మాటకి ఉలిక్కిపడి ఆ తరువాత సిగ్గుపడింది

మీరు ఏం చెప్పక్కరలేదు ప్రేమ వార్త వినగానే మీ బుగ్గమీద వ్రాసిన

మందారాలే మీకు, పతంజలి అంటే ఇష్టమని చెప్పకనే చెబుతున్నాయి అన్నాడు శశికాంత్.

పంతజలి గారంటే నాకు ఇష్టమే. ఆయన నన్ను ప్రేమిస్తున్నారని నాకు ఎప్పుడోతెలుసు. అయితే ఇక్కడ ఒక చిక్కువచ్చి పడింది. చదువు అయిపోయాక, ఖాళీగా ఉండటం ఇష్టంలేక ఇక్కడ వర్కు చేస్తున్నాను. మాది హైదరాబాదు. మా వాళ్ళందరూ అక్కడే ఉన్నారు. మీకుతెలుసో, తెలియదో హెడ్ మాష్టారుగారు మాపెదనాన్నగారు. ఆయనింట్లోనే ఉంటూ నేను ఈ ఉద్యోగం చేస్తున్నాను. అంది విమలారాణి చిరునవ్వుతో

అమ్మపుట్టిల్లు మేనమామకి తెలియదా, హెడ్మాష్టార్ల ప్రవేట్లైఫ్ టీచర్లకి తెలియదా. మాకు అన్ని విషయాలుతెలుసు. ముందుగా మీ పర్మిషన్ తీసుకుని, మీరు పచ్చజెండా ఊపుతే అప్పుడు ఆచంద శాసనుడుగారిని అడుగుదామని నిశ్చయించుకొన్నాం. అయితే ఇందులో మా స్వార్థం ఏమీ లేదండోయ్. అంటే పతంజలి మిమ్మల్ని వివాహం చేసుకొని, తద్వారా హెడ్మాష్టారుగారికి చుట్టం అయితే, అతని ద్వారా మేం ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు పొందటానికి ఈప్లాను వేశామని మీరనుకొంటే అదిపొరపాటే. అన్నాడు ఎడ్విన్రాజు.

"అలా అని ఇప్పుడు ఎవరన్నారు?" ఆశ్చర్యంగా అడిగింది విమలారాణి

అబ్బే, అనుకొంటారేమోనని చెప్పాను నసిగాడు ఎడ్విన్‌రాజు

డియర్ ఫ్రెండ్స్ మనం సమయాన్ని వృధా చేయటం మంచిది కాదు. కాలం అమూల్యమైనది, గతించినకాలం తిరిగి రాదని మామామయ్య మురళీ కృష్ణ చెప్పాడు. కనుక ఇక్కడ టైము వేస్టు చేయటం అనవసరం. పిల్లకి పిల్లాడు నచ్చాడు. పిల్లాడికి పిల్ల నచ్చింది. ఇక పెద్దవాళ్ళ అనుమతి కావాలి. అసలు పెద్దవాళ్ళు హైదరాబాదులో ఉన్నందున నకిలీ పెద్దఅయిన విమలపెదనాన్న చలపతిని, అదే మన హెడ్మాష్టార్‌ని అడిగి ఈ ప్రేమపక్షులగోల ఆపి, వివాహతంతు జరిపించమని చెబుదాం. అన్నాడు శశికాంత్.

ఏమిటి ఈవిషయంలో పతజంలిగారికంటే నాకంటే మీరే ఎక్కువ ఖంగారు పడుతున్నట్టుంది. ఏమిటి సంగతి. అని అడిగింది విమలారాణి అనుమానంగా.

అబ్బే. ఏముంది. ఈ ప్రేమ వివాహం సక్సెస్ అయి మన స్కూల్లో ఒక ప్రేమ వివాహం జరుగుతే. రేపుమేం ఎవరినైనా ప్రేమించినప్పుడు ఉపయోగపడుతుందికదా అని మాఆరాటం. మీ వివాహంకై పోరాటం. అంతే అన్నాడు శశికాంత్ తడబడుతూ.

నడవండి. ఇప్పుడేవెళ్ళి మిగిలిన సంగతులు చూసేద్దాం అన్నాడు ఎడ్విన్ రాజు.

లేడికి లేచిందే పరుగు. ఈ రోజుకి మనం సాధించింది తక్కువేమికాదు. పతంజలి మనసులోని ప్రేమ సంగతి కనిపెట్టాం. అందరం కలసి కృషిచేసి ప్రేమ వివాహం జరిపించాలని నిశ్చయించుకొన్నాం విమలారాణిగారి అనుమతిని సంపాదించాం చాలు ఇంక మాటలు చాలు ఇంక ప్రయత్నాలు.

మరల రేపు ఉదయం మనము కలుసు కొందము. హెడ్‌మాష్టార్‌తో మాటలు రేపు చూసుకొందము. అని పాటలా పాడాడు సుబ్రహ్మణ్యం.

అయితే నేను వెడతాను. చీకటిపడు తోంది అని చెప్పి, పతంజలికేసి చూసి కొంటెగానవ్వి, ఇంటికి బయలుదేరింది విమలారాణి హుందాగా.

ఆ నవ్వుకి మనవాడు స్పృహతప్పి పడి పోయాడేమో చూడండిరా. అన్నాడు శశి కాంత్. అప్పటికే పతంజలి స్పృహతప్పి పడిపోయి ఉన్నాడు.

పెళ్ళి మాటలకి వీడిని తీసుకొని రావటం అనవసరం. మాట్లాడిందీలేదు. ఏమీలేదు. దర్జాగా స్పృహ మాత్రం తప్పాడు. అని విసుక్కొన్నాడు ప్రసాద రావు.

ఏమనుకొని ఏం లాభం. వీడినిరిక్షాలో వేసుకొని వీడి ఇంటిదగ్గర దించి మనం మన ఇళ్ళకి చేరుకొందాం రేపు మిగిలిన విషయాలు చూసుకొందాం. అన్నాడు ఎడ్విన్‌రాజు. నలుగురూకలసి పతంజలిని రిక్షాలోవేసుకొని బయలుదేరారు.

పతంజలి స్పృహతప్పిపడిపోగానే ఒక షోడాబండివాడు ఆశగా రాబోయాడు కాని నలుగురూకలసి పతంజలిని రిక్షాలో తీసుకొనిపోగానే వాడు స్పృహతప్పి పడి పోయాడు.

o o o

ఏమిటి అందరూకట్టకట్టుకుని వచ్చారు క్లాసులు ఏమైపోతాయి. పిల్లలు ఏమైపో తారు. వెళ్ళండి. వెళ్ళి పనిచూసుకోండి. అన్నాడు చలపతి ఆయాసపడిపోటూ.

ఒకమాట మీకు చెప్పిపోదామని. నసి గాడు ఎడ్విన్‌రాజు భయంగా

ఒక్కమాట చెప్పటానికి ఇంతమందా. అయినా చెప్పేదేదో సాయంత్రంస్కూలు విడిచిపెట్టాక చెప్పవచ్చుకదా. సరే వచ్చే సారుగా చెప్పండి. అన్నాడు చలపతి చిరాగ్గా.

ఏమీ లేదండి మీకు పతంజలి తెలుసు కదా. అన్నాడు ప్రసాదరావు.

ఏ పతంజలి అసహనంగా అడిగాడు చలపతి.

నాల్గవతరగతి ఏ సెక్షన్ పతంజలి. అని వివరించాడు శశికాంత్.

తెలియకపోవడమేమిటి. మీ వెనకాలే ఉన్నాడుగా. అన్నాడు చలపతి.

మీకు విమలారాణి తెలుస్నుదా. అని మళ్ళీ అడిగాడు ప్రసాదరావు.

మీ ఉద్దేశ్యం ఏమిటి. ఒక్కొక్కళ్ళ పేర్లుచెప్పి, వాళ్ళు తెలుసా, వీళ్ళుతెలుసా అని అడుగుతున్నారు. నా జ్ఞాపకశక్తి పరీక్షిద్దామనా, పని ఎగగొడదామనా. కసిరాడు చలపతి.

అడిగినదానికి చెప్పండి. విమలారాణి తెలుసా. అసహనంగాఅడిగాడు శశికాంత్

తెలుసు నాలుగవతరగతి 'బి సెక్షన్.' అన్నాడు చలపతి చురచుర చూస్తూ.

ఈ పతంజలి ఆ విమలారాణిని ప్రేమించాడు. అన్నాడు ఎడ్విన్‌రాజు.

వాట్ గట్టిగా అరిచాడు చలపతి. ఆ అరుపుకి స్కూలు దదదదలాడింది.

అలాగే విమలకూడా పతంజలిని ప్రేమించింది. అని మరోబాంబు పేల్చాడు ఎడ్విన్‌రాజు. పతంజలి వాళ్ళు మాట్లా డేది తనసంగతి కానట్లు గోడలవంక చూడసాగాడు.

ఇది పవిత్రమైన స్కూలు అనుకుం టున్నారా? పబ్లిగ్‌పార్క్ అనుకుంటు న్నారా? పతంజలిని ఈ క్షణంనుంచే తీసేస్తున్నాను. అన్నాడుచలపతివిసురుగా

నో ఇది అన్యాయం. నా ప్రశ్నకి సమాధానం చెప్పండి. ఎవరైనా వచ్చి మీ రెండుచెంపలనీ టపటపా వాయించి పడేస్తే ఒక చెంపకి కాపడం పెట్టుకుం టారా? అని అడిగాడు శశికాంత్.

ఇప్పుడు అది ఎందుకు. అయినా నన్నుకొట్టేదెవరు? అనిఅడిగాడు చలపతి.

ముందు నేను అడిగినదానికి చెప్పండి. అసహనంగా అడిగాడు చలపతిని, శశి కాంత్. పతంజలికి కాస్త ధైర్యం వచ్చి చలపతికేసి చూడసాగాడు.

రెండుచెంపలకీ కాపడం పెట్టుకుం టాను. అన్నాడు చలపతి.

అలాగే పతంజలిని విమల, విమలని పతంజలి పరస్పరం ప్రేమించుకున్నారు. ఇప్పుడు మొత్తం తప్పు అంతా పతంజలి మీదవేసి, ఆమెని ఈ స్కూలునుంచి తీసేస్తానని బెదిరిస్తున్నారు. విమలని ఏమీ చేయలేరు. ఎందుకంటే విమల మీ తమ్ముడి కూతురు. అందుకని స్వార్థ బుద్ధితో ఆలోచించి ఈ చర్యకి పాల్పడు తున్నారు. అన్నాడు తీవ్రంగా.

విమల నాతమ్ముడి కూతురని మీకెలా తెలుసు. ఖంగారుగా అడిగాడు చలపతి.

ఆకాశవాణి చెప్పింది. పతంజలిని తీసేయటం అన్యాయం. అలా అతనిని తీసేస్తే పరిస్థితి తీవ్రంగా ఉంటుంది. ఆలోచించుకోండి. అని బెదిరించాడు ప్రసాదరావు.

ఏమిటయ్యా బెదిరిస్తారు. ఇదిస్కూలు ఇక్కడ ప్రేమలు పనికిరావు. బుద్ధిగా పాఠాలు చెప్పుకుంటే చెప్పుకోమనండి. లేదా పొమ్మనండి. అన్నాడు చలపతి విసుగ్గా.

విమలగారి పెద్దలు ఇక్కడ లేరు కాబట్టి మీతో మాట్లాడవలసి వస్తోంది చిరాగ్గా. వాళ్ళు వాళ్ళు ఉంటే వాళ్ళతోనే డైరెక్టుగా మాట్లాడేద్దుము. అన్నాడు సుబ్రహ్మణ్యం.

ఇక్కడ విమలకి ఉన్న ఏకైక పెద్ద దిక్కుని నేనే. ఇప్పుడప్పుడే మా విమ లకి పెళ్ళి చేయదలచుకోలేదు. చేసినా పతంజలిలాంటి వాడికి చస్తే చేయం. అన్నాడు చలపతి.

పతంజలికి ఏం తక్కువ సార్. కన్ను వంకరా? కాలువంకరా? అడిగాడు శశి కాంత్.

మొత్తం మనిషే వంకరయ్యా. ఆడ పిల్లల వెనకపడుతూ, ఇలా అల్లరిచిల్లరిగా తిరిగేవాడు ప్రేమకిఅర్హుడేమోకాని, పెళ్లికి అనర్హుడు అన్నాడు చలపతి.

తప్పుసార్ ఆడపిల్లల వెనుక పడ లేదు. ఒకేఒక ఆడపిల్ల వెనుక పడ్డాడు.

అదీ మీ విమల. ఇతనికి ఏంతక్కువ సార్. ఆస్తిఉంది. అందంఉంది. చదువు ఉంది. ఆస్తి ఉంది. ఓహో ఇవి చెప్పే సేనుకదూ. ఇన్ని ఉన్న పతంజలికి ఏం తక్కువసార్. మరేఆడపిల్ల తండ్రి అయినా అయితే గభాలున ముందుకి ఉరికి మరి ఒప్పుకుంటాడు. అన్నాడు ఎడ్విన్‌రాజు.

"అలా గభాలున ఉరికే వాడిని పట్టు కోండి." అన్నాడు చలపతి వేళాకోళంగా

"అలాపట్టుకోవాలంటే ఈ ఊరిలో

ఉన్న వందమంది ఆడపిల్లల తండ్రులని పట్టుకోవాలి. కాని వాడు ప్రేమించింది మాత్రం విమలని" అన్నాడు ప్రసాదరావు ముందుకివచ్చి.

"ఆస్థి ఏమాత్రం ఉంది?" వ్యంగ్యంగా ప్రశ్నించాడు చలపతి.

"బోల్డంత. మీకు కాకి తెలుసా?" అని అడిగాడు సుబ్రహ్మణ్యం.

"ఏ కాకి." ఆశ్చర్యంగా అడిగాడు చలపతి.

"ఏకాకి" కాదు. కావు కావుమనే కాకి. అని బదులిచ్చాడు సుబ్రహ్మణ్యం.

"తెలుసు." అన్నాడు చలపతి అయోమయంగా.

"ఆ కాకిని ఎంగిలి చేత్తో కూడా కొట్టకుండా సంపాదించాడు పతంజలి వాళ్ళనాన్న. కాకినాడలో ఉన్న వాళ్ళ పొలం అమ్మేస్తే బొంబాయి కొనేయవచ్చు." అన్నాడు సుబ్రహ్మణ్యం.

"అంత ఆస్థి ఉంటే విమలకన్నా అందగత్తెనే చేసుకోవచ్చు కదా." అన్నాడు చలపతి.

"విమల అందం గురించి మీకేం తెలుసు. నాకళ్ళతో చూడండి అన్నాడు పతంజలి.

"ఈ వాదనలన్నీ అనవసరం. విమలని పతంజలి కిచ్చి వివాహం చేయటమనే ప్రశ్నేలేదు. మీరు వెళ్ళి క్లాసుల్లో కూర్చోండి. టైము వేస్టు చేయకండి." అన్నాడు చలపతి.

"సార్. మీరు నిరంకుశంగా వ్యవహరిస్తున్నారు. విమలది, పతంజలిది ఈనాటి బంధం కాదు. ఏడేళ్ళ నుంచి తొమ్మిది జన్మలఅనుబంధం. ఏడడుగులు కలిసి నడుస్తే వారు మిత్రులవుతారంటారు. స్టాఫ్‌రూమ్ నుంచి క్లాసుకి, క్లాసు నుంచి స్టాఫ్‌రూమ్‌కి ఇప్పటికి ఏడువందల సార్లు కలిసి నడిచారు. అంటే నాలుగువేల ఎనిమిది వందల సార్లు కలిసి నడిచారు." అన్నాడు ప్రసాదరావు.

"నువ్వు లెక్కలలో పూర్ అని నాకు ఇప్పుడు తెలిసింది. రేపు నీ లెక్కల క్లాసులో ఒకసారి గుడ్డుచేయి వెరిఫికేషన్ చేయాలి." అన్నాడు చలపతి కోపంగా.

"సార్. సమస్యని పక్కదారి పట్టించకండి." అన్నాడు సుబ్రహ్మణ్యం కోపంగా.

"ఏమిటయ్యా బెదిరిస్తున్నారు. ఈ పెళ్ళి జరగదు. మీరు మీ మీ క్లాసులలోకి వెళ్ళికూర్చుంటే కూర్చోండి. లేదా బయటకి పొండి." అని కసిరాడు చలపతి.

"సార్. పుండుమీద కారం చల్లుతున్నారు. ఈ సమస్య తేలకపోతే ఈ క్షణంనుంచే సమ్మె మొదలు పెడతాం. అప్పుడు దిగివస్తారు." అని అరిచాడు ప్రసాదరావు.

"ఏమిటయ్యా బెదిరిస్తున్నారు. ఇది గవర్నమెంట్ స్కూలు కాదు. ప్రయివేటుస్కూలు. ఒకవైపు అవ్ కాన్వెంట్ మీరు సమ్మెచేస్తే మీఐదుగురినీ పీకిపడేసి వేరేవాళ్ళని పెట్టుకొంటాను. ఈసారి ప్రేమా, పెళ్ళి అనని ముసలివాళ్ళని పెట్టుకొంటాను." అన్నాడు చలపతి సీరియస్‌గా.

"ముసలి వాళ్ళక్కూనే ప్రేమలు ఎక్కువసార్. మన ఆడముసలి టీచర్లని క్షేమంగా [illegible]కోలేదా సార్. వాళ్ళు ఏం పాపం చేసారుసార్."

అన్నాడు ఎడ్విన్‌రాజా.

"ఒరే ఎడ్విన్‌రాజా. ఆయన అంత సీరియస్‌గా మాట్లాడుతుంటే నీ వేళాకోళాలు ఏమిటి. బెదిరించటం ఆయనకేమైనా కొత్తా. మనల్ని తీసేస్తే మనంత బాగా చెప్పగల టీచర్లు ఎవరు వస్తారో చూద్దాం. అప్పుడే తేలుద్దాం." అన్నాడు ప్రసాదరావు తీవ్రంగా.

"ఒరే. నాకోసం మీ జీవికాలని బలి చేసుకోవద్దు. నాది పాపపుజన్మ. ఈ జన్మకి విముక్తి నాకుదక్కదు. సైంధవుడు అడ్డుపడితే ప్రేమికుడికి పోట్లు చెప్పతరమా? మీ ఉద్యోగాలు పోవటం నాకు ఇష్టం లేదు. ఏ ఊరి బయటో కూర్చుని విరహగీతాలు పాడుకొంటాను. చిరిగిపోయిన కాలువలు ఉంటే ఇవ్వండి బజాన వేసుకొంటాను." అన్నాడు పతంజలి.

"ఈయన పెత్తనం ఏమిటిరా? మనం డైరెక్టుగా అసలు వాళ్ళని కన్విన్స్ చేద్దాం. వాళ్ళు ఈ ప్రేమ వివాహానికి ఒప్పుకొని తీరతారు." అన్నాడు శశికాంత్ ధీమాగా.

"ఇతని మీద చెడుగా నేను చెబుతాను. అప్పుడు వాళ్ళు ఎలా ఒప్పుకొంటారో చూస్తాను. నామాటకాదని వాళ్ళు ఏ నిర్ణయమూ తీసుకోరు." అన్నాడు చలపతి పొంందాగా.

"అలా మీరు ఇతని మీద చెడుగా చెబితే, మేంమీగురించి చెడుగా కరస్పాండెంట్ గారితో చెబుతాం. అప్పుడు మీ పని కుడితిలో పడ్డ ఎలుకలా అవుతుంది." అన్నాడు ప్రసాదరావు.

'అంటే సైమలుగారితో చెబుతారా?' కోపంగా అడిగాడు చలపతి.

"అనేకదా దాని అర్థం." అన్నాడు శశికాంత్ నవ్వుతూ.

"అయితే నేను ఆలోచించుకోవాలి." అన్నాడు చలపతి.

"పెళ్ళిగురించేనా, ఇంకా ఆలోచన ఎందుకు" అన్నాడు శశికాంత్.

"పెళ్ళి గురించికాదు మిమ్మల్ని ఇతని గురించి ఎందుకు తీసేయకూడదా అని. మీ ప్రవర్తన నాకునచ్చలేదు. పాతుంత్రం మిమ్మల్ని తీసేసినట్లు నోటీసు వస్తుంది సంతకం పెట్టిపంపించండి. మీ బెదిరింపు నేను పడలేను. దట్సాల్." అన్నాడు చలపతి ఒక నిర్ణయానికివచ్చి.

"ఈ భగీరథ భార్గవపురంలో మీది ఒక్కటే స్కూలు కాదు. చెప్పుకొనే వాడికి అరవైనాలుగు స్కూల్స్. తీసేస్తేమాకేం భయమా వేరేస్కూల్‌కి పోతాం." అన్నాడు ప్రసాదరావు.

"ఒరే. నాగురించి మీరందరూ వర్రీ కాకండి. నాది దురదృష్ట జాతకం. మీరు ఇప్పటివరకు సహకరించారు. నాకు అదేచాలు. నడవండి క్లాసులలోకి" అని తనమిత్రులకి చెప్పి. "సార్! నాగురించి వీళ్ళని తీసేయకండి, అలాగే ప్రేమ గురించి నన్ను తీసేయకండి. ఇకమీద ప్రేమా, దోమా అనకుండా బుద్ధిగా పాఠాలు చెప్పుకొంటాను." అనిచలపతికి క్షమాపణ చెప్పి బయటకి నడిచాడు పతంజలి. చలపతి మొహంలోకి సంతోషం ప్రవేశించింది.

అసలైనవాడే జారుకొనేసరికి, చేసేది లేక మిగిలిన నలుగురూ బయటకి నడిచారు. చలపతి గర్వంగా మీసాలు ఎగదువ్వి. పేపరులో తలదూర్చాడు హుషా

రుగా.

"ఛి. ఛీ. వీడంత బుద్ధితక్కువవాడు ప్రపంచంలో మరొకడు ఉండడు. మరొక్క నాలుగు డైలాగులు ఘాటుగా ఉంటే ఆ చలపతి దిగివచ్చేవాడే ఇంతలో వీడు నీరుకారిపోబట్టి వాడు పైమెట్టుకి ఎక్కాడు. వీడిని తన్నినా బుద్ధిరాదు. వీడి గురించి మాట్లాడి అనవసరంగా మనం హెడ్మాష్టారిదృష్టిలో వెధవలంగా మిగిలాం." అన్నాడు శశికాంత్ ఘుమ ఘుమలాడుతూ.

'తప్పు వీడిదికాదు. మనది. వీడు ప్రేమిస్తే మనం పట్టించుకోవటం మన తప్పు. వాడి ఖర్మానికి వాడిని వదిలేయ వలసింది. ఇప్పుడు వీడుబాగానే ఉంటాడు ఆ చలపతి బాగానే ఉంటాడు. ఆ అమ్మాయి బాగానే ఉంటుంది. మధ్యలో మనం ఇరుక్కున్నాం." అన్నాడు ప్రసాదరావు.

"ఒరే. మిత్ర ద్రోహులూ. నాలో ఎన్ని అగ్నిపర్వతాలు పేలబట్టి ఆమాట అన్నానో. ఎన్ని సముద్రాలు పొంగబట్టి ఆ క్షమాపణ అడిగానో మీకు తెలియదు. నామూలంగా మీఉద్యోగాలు ఊడతాయని ఫలితంగా మీరు ఈ " భగీరధభార్గవ పురంలో " నిరుద్యోగులుగా మిగులుతా రని భయపడి మనసుని చంపుకొని మమతతెంచుకొని, ప్రేమదాచుకొని పెళ్ళి ఆలోచన మానుకొని ఆ క్షమాపణ అడి గాను. తప్పయితే క్షమించండి." అన్నాడు పతంజలి దీనంగా.

"సరే జరిగినదేదో జరిగింది. ఇక ఆరూట్లో మనం విజయం సాధించలేం. అసలు పెద్దలని కలుసుకున్నా, ఈ చలపతి చెడగొట్టేస్తాడు. కనుక చలపతి ద్వారానే మనం ఈ పెళ్ళి జరిపించాలి. దానికి మార్గం ఆలోచిం చాలి." అన్నాడు శశికాంత్.

"అది సరేకాని ఒరే సుబ్రమహ్మణ్యం. ఈ పతంజలిగాడికి బొంబాయిని కొనేసే టంత ఆస్తి ఎక్కడిదిరా? నాకు తెలియక అడుగుతాను." అన్నాడు ప్రసాదరావు నవ్వుతూ.

"బొంబాయి కొనటానికి పెద్ద ఆస్తి కావాలేంట్రా. రూపాయో రెండు రూపా యలో ఉంటుంది. ఆమాత్రం డబ్బులు లేవావీడిదగ్గర. " అన్నాడు సుబ్ర హ్మణ్యం విసుగ్గా.

" ఏమిటి బొంబాయి అంత చవక అయిపోయిందా. నాకు తెలియనే తెలి యదు. నేను ఈమధ్య పేపరు చూడటం లేదు." అన్నాడు ప్రసాదరావు.

"వాడు అడగటానికి, నువ్వు చెప్ప టానికి సరిపోయింది. వాడనేది వంటిం ట్లో కిరసనాయిల్ కొట్టు కొనే బొం బాయి. అర్థంఅయిందా. అని అడిగాడు శశికాంత్ చిరాగ్గా.

"అయితే ఇక్కడ ఎందుకు. ఎవరి క్లాసులలోకి వాళ్ళుపోదాం. అసలైనవాడే వద్దంటుంటే మనం పట్టుకొని వేలాడటం ఎందుకు. అన్నాడు ఎడ్విన్ రాజు.

"నాకు ఒకప్లాను తట్టింది రా. అన్నాడు శశికాంత్ సంతోషంగా.

"వద్దురా. బాబువద్దు. ఏ ప్లానులూ భరించే ఓపికలేదు. అయినా పాఠాలు చెప్పుకొనే వాళ్ళం మనకి ప్రేమలెందు కురా, దండగ్గా" అన్నాడు సుబ్రహ్మ ణ్యం భయపడుతూ.

"ఒరే మనలది అందరిలాంటి స్లూలు కాదు. మనం అందరిలాంటి టీచర్లమూ కాము. మన "దేహాంతకుడు" కాన్వెంటుకి "భగీరథ భార్గవపురం"లో మంచి పేరు ఉంది. ఇప్పుడు ఈ ప్రేమ వివాహం కూడా సక్సెస్ అయితే మన కాన్వెంట్ కి తిరుగు ఉండదు. కనుక మనం నేను చెప్పేప్లానుని అనుసరిస్తే విజయం సాధిస్తాం. అన్నాడు శశికాంత్ ధీమాగా.

"వద్దన్నా మానేటట్టులేవు. సరే చెప్పేదువు." అన్నాడు ఎడ్విన్‌రాజు.

"మీ చెవులిలాపడేయండి." అన్నాడు శశికాంత్. అందరూ తమ తమ చెవులని శశికాంత్ దగ్గరపడేసారు. ఆ చెవులలో ఏదో చెప్పాడు శశికాంత్. ఆ ప్లాను విన్న నలుగురి మొహాలలోకి ఆనందం ప్రవేశించింది. ఆ ప్లానులోని లోటు, పాట్లు చర్చించి దానికి ఒక రూపం ఏర్పరచి ఐదుగురూ ఆనందగా క్లాసులలోకి బయలుదేరారు.

ం ం ం

"ఏమిటయ్యా ఇది. మీరు చేసేది ఏమన్నా బాగుందా. అసలు మన కాన్వెంటికి మంచిపేరు రావటం మీకు నచ్చదేమిటయ్యా." అని అడిగాడు చలపతి కోపంగా.

ఐదుగురూ చేతులు కట్టుకొని వినయంగా నిలబడి ఉన్నారు.

"ఏమిటి మాట్లాడరేం. మిమ్మల్నే అడిగేది." అన్నాడు చలపతి చిరాగ్గా.

"మేం ఏం చేసామండి." అమాయకంగా అడిగాడు శశికాంత్.

తెలియనట్టు అడిగి నాకు కోపం తెప్పించకండి. మిష్టర్ శశికాంత్. నువ్వు నిన్న సినిమాహాలులో సిగరెట్లుతాగావా?" అని అడిగాడు చలపతి కోపంగా.

"సిగరెట్లు కాదండి. ఒకటే తాగలేదండి. పీల్చాను." అన్నాడు శశికాంత్.

"నువ్వు ఎన్నితాగితే నాకు ఎందుకు, ఎన్ని పీలిస్తే నాకు ఎందుకు. నిన్న హాలులో పొగత్రాగుతుండగా పోలీసులు పట్టుకొంటే ఏమనిచెప్పావు." అని అడిగాడు చలపతి.

"ఏమని చెబుతానండి. ఈ కాన్వెంట్‌లో పనిచేస్తున్నాననిచెప్పి మీ పేరు చెప్పానండి. దెబ్బకి వదిలేసారు పోలీసులు." ఆనందంగాచెప్పాడు శశికాంత్.

"మిష్టర్ ఎడ్విన్‌రాజూ నిన్న లైటు లేకుండా సైకిలు తొక్కుతుంటే పోలీసు నిన్ను పట్టుకొన్నప్పుడు ఏమనిచెప్పావు" అని అడిగాడు చలపతి అసహనంగా.

"ఏమని చెబుతానండి. ఈ కాన్వెంట్‌లో పని చేస్తున్నాననిచెప్పి, మీ పేరు చెప్పానండి. దెబ్బకి వదిలేసారు పోలీలు" ఆనందంగా చెప్పాడు ఎడ్విన్‌రాజు.

"మిష్టర్ ప్రసాదరావు నిన్న నువ్వు రాంగ్‌సైడులో సైకిలు తొక్కుతుంటే, పోలీసులు పట్టుకొన్నప్పుడు ఏమని చెప్పావు." అని అడిగాడు చలపతి పళ్ళు కొరుకుతూ.

"ఏమని చెబుతానండి. ఈ కాన్వెంట్‌లో పనిచేస్తున్నాననిచెప్పి మీ పేరు చెప్పానండి. దెబ్బకివదిలేసారుపోలీసులు" నవ్వుతూ చెప్పాడు ప్రసాదరావు.

"మిష్టర్ సుబ్రహ్మణ్యం అండ్ మిష్టర్ పతంజలి. నిన్న మీ రిద్దరు సైకిల్ మీద వస్తుంటే, డబుల్స్ ఎక్కారని పోలీసులు పట్టుకొంటే ఏమని చెప్పారు." అని అడిగాడు చలపతి.

"ఏమని చెబుతామండి. ఈ కాన్వెంట్‌లో పనిచేస్తున్నామని చెప్పి. మీ పేరు చెప్పామండి. చెప్పాక వదిలేసారు పోలీసులు." ముక్తకంఠంతో చెప్పారు ఇద్దరూ.

చలపతి కోపంగా పళ్ళు కొరుక్కొని, బిర్లిగుద్దారు.

"మిమ్మల్ని ఐదుగురినీ తీసేస్తాను అప్పుడు." అన్నాడు చలపతి కోపంగా.

"అప్పుడు ఈ కాన్వెంట్‌కి మాజీ టీచర్లుగా ఇంకా అల్లరి చేస్తాం." అన్నాడు ప్రసాదరావు.

"ఇది బ్లాకు మెయిల్." అన్నాడు చలపతి చేసేది లేక.

"మీరు ఏమనుకొన్నా నాకు అభ్యంతరం లేదు. అయినా ఏమిటి సార్, ప్రేమించుకున్న ఒక జంటకి పెళ్ళి చేయమని అడిగారంతే కదా. పెళ్ళి చేస్తే చిలకా గోరింకల్లా ఆ దంపతులు ఇద్దరూ పాఠాలు చెబుతుంటే చూడటానికి ఎంతో బాగుంటుంది. మీరు ఏ మాత్రం సందేహించకుండా ఈ పెళ్ళికి ఒప్పుకోండి సార్." అన్నాడు శశికాంత్ ప్రాధేయపడుతూ.

"అది కాదయ్యా బాబూ. నా పరిస్థితి అర్థం చేసుకోండి. ఆ విమల కంటే వయసులో పెద్దదయిన కూతురు నాకు ఉంది. దాని పెళ్ళికాకుండా:" అనినని గారు చలపతి దిన్నగా.

"అదా సార్. మీరెంగ. ఎందుకు సార్ దానికి చింత. ఈ శశికాంత్ ఉన్నాడు మీవెంట. నాకు ఉద్యోగం వచ్చినా పెళ్ళి గురించి పట్టించుకోవడం లేదు ఇంట్లో వాళ్ళు. మీ అమ్మాయినే చేసుకొంటాను. అన్ని విధాలారాభంవాకు." అన్నాడు శశికాంత్ ముందుకి వచ్చి.

"నీకు ఆస్తి ఎంత ఉంది." అనుమానంగా అడిగాడు చలపతి.

"ఈ రోజుల్లో ఆస్తి ఏమిటి సార్. ఒక్క భాగ్యలక్ష్మి లాటరీ టిక్కెట్టు కొంటే రేపే పెంటికి లక్షాధికారిని. అయినా మీ ఆస్తి నా ఆస్తి కాదా సార్." అన్నాడు శశికాంత్.

"సార్. పనిలోపని మీకు మరో ముగ్గురు కూతుళ్ళుంటే చెప్పండి సార్ పెళ్ళికి మేం ముగ్గురం కూడా రెడీగానే ఉన్నాం." అన్నారు ప్రసాదరావు ముందుకి వచ్చి.

"మీ పెళ్ళికి ఒప్పుకున్నాక కూడా ఇక్కడే నిలబడతారేం. క్లాసులకివెళ్ళండి. పిల్లలందరు చూస్తూఉంటారు. మిగిలిన విషయాలు తరువాత మాట్లాడుకొందాం." అన్నాడు చలపతి. ఐదుగురు చలపతికాళ్ళ మీదపడి దీవెనలు పొందారు.

"ప్రేమకే విజయం. దానికి లేదు అపజయం" అనినినాదాలిచ్చి అక్కడ నుంచి బయలుదేరారు ఐదుగురూ. చలపతి ఆనందంగా పేపర్లో తలదూర్చాడు.

విమలారాణిని తలచుకుంటూ పతంజలి. చలపతి కూతుర్ని తలచుకొంటూ శశికాంత్. తమకి కాబోయేవాళ్ళు ఎవరా అని ఆలోచించుకుంటూ ఎడ్విన్‌రాజా, ప్రసాదరావు, సుబ్రహ్మణ్యం ఎవరి క్లాసులకి వాళ్ళు బయలుదేరారు ఆనందంగా. O

---

*"హాస్య బ్రహ్మ" శ్రీ యర్రంశెట్టి సాయిగారికి ఈ చిరుకానుక అంకితం.*

*— రచయిత*